క్లుప్తంగా

నేటి నుంచి నీటి సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: పాత పైపులైన్ నుంచి కొత్త పైపులైన్‌కు మార్పు కారణంగా రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రమణ సోమవారం తెలిపారు. ఇటీవల నాగులాపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి ఉప్పాడ వరకూ వేసిన కొత్త లైనుకు మార్చడం వల్ల మంగళ, బుధవారాలు తాగునీటికి అంతరాయం కలుగుతుందన్నారు. వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, రవీంద్రపురం, ఉప్పాడ, సుబ్బంపేట, కొత్తపట్నం, అమీనాబాదు గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పెద్దాపురం: విశాఖపట్నంలో నిర్వహించిన 11వ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక వరహాయ్యలపేట యానలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో యోగా గురువు వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కాటా విభాగంలో తెప్పల యోగేశ్వర్ గోల్డ్ మెడల్, కుమిటిలో బంగారు పతకాలు సాధించాడు. బాలికల విభాగంలో యానలపు సూర్యకళ కాటా, కుమిటి విభాగాల్లో బంగారు పతకం సాధించింది. జూనియర్స్ విభాగంలో పాసిల లోకేష్ కాటా విభాగంలో సిల్వర్, కుమిటి విభాగంలో బంగారు పతకాలు సాధించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ అభినందించారు.

గంగాధర్‌కు యంగ్ మైండ్స్ అవార్డు



యంగ్ మైండ్స్ అవార్డు అందుకుంటున్న తోటకూర గంగాధర్

సామర్లకోట: పీబీ దేవం శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ 'యంగ్ మైండ్స్-రేపటి కోసం' స్వచ్ఛంద సంస్థ నుంచి ఆదివారం రాత్రి సేవా పురస్కారం అందుకున్నారు. యంగ్ మైండ్స్- రేపటి కోసం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కాకినాడ యంగ్ మెన్ హ్యాపీ క్లబ్ దంటు కళా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు గాదే శ్రీనివాసు నాయుడు, పేరా రాజశేఖర్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు గంగాధర్ స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ మేరకు సోమవారం తోటకూర గంగాధర్‌ను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, కార్మిక సంఘ నాయకుడు దవులూరి సుబ్బారావులు అభినందించారు.

హుండీల ఆదాయం లెక్కింపు



మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ తల్లి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 35 రోజులకు గాను సుమారు రూ.37,50,460 ఆదాయం సమకూరినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ట్రస్టీ చింతపల్లి శ్రీహర్ష, ఈఓ పళ్లంరాజుల సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతర మధ్యలో హుండీలను లెక్కించామన్నారు. అన్నదాన విరాళాలుగా రూ.33,555 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

కొత్తపల్లి: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వాకతిప్పకు చెందిన రవణం సుబ్రహ్మణ్యాన్ని నియమించినట్లు సోమవారం ఆయన తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎస్ ఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు బిక్కిన ఈశ్వరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కుల పంపిణీ

సామర్లకోట: హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన యవర్న దుర్గకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన చెక్కును సోమవారం అచ్చంపేటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. ఈ మేరకు రూ.40,028 ఆర్థిక సాయం మంజూరు కావడంతో ఆమెకు అందజేశారు. గ్రామ నాయకుడు చల్లా బుజ్జి, సామర్లకోట రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు పాల్గొన్నారు.

వానాకాలం కష్టాలు



సామర్లకోటలో చెరువులా మారిన సత్యనారాయణపురం రోడ్డు



సామర్లకోట జయలక్ష్మి థియేటర్ రోడ్డులో వర్షపు నీరు



పెద్దాపురం నాయీబ్రాహ్మణ కాలనీలో నిలిచిపోయిన నీరు

- కొద్దిపాటి వర్షానికే వీధులు జలమయం
- ఇబ్బంది పడిన ప్రజానీకం

సామర్లకోట: ఊరూవాడా చెరువైంది.. కొద్దిపాటి వర్షానికే నిండా తడిచింది.. వానాకాలం కష్టాలను తెచ్చింది.. సామర్లకోటలో సోమవారం మధ్యాహ్నం సుమారు 20 నిమిషాల పాటు కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్లు చెరువులుగా మారిపోయాయి. డ్రైన్లు పొంగి పొర్లి నీరు రోడ్లపైకి చేరింది. స్థానిక స్టేషన్ సెంటర్, బస్ కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథం సెంటర్, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు ముంపునీట దర్శనమిచ్చాయి. స్టేషన్ సెంటర్‌లో రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైన్‌లో నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువులా మారింది. ఆ రోడ్డులో అడుగడుగునా గోతులు ఉండటంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సత్యనారాయణపురం రోడ్డు మార్జిన్‌లో ఉన్న షాపుల్లోకి వర్షపు నీరు చేరింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైన్‌లోకి చేరుతుంది. అయితే ఆ డ్రైన్ నిండిపోవడంతో జయలక్ష్మి థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. డ్రైన్లలో పూడిక తీయడానికి అవకాశం లేకుండా ఆక్రమించడంతో రోడ్లపై నీరు నిలిచి పోయిందనే వాదనలు ఉన్నాయి. రోడ్లపై ఉన్న వర్షపు నీరు డ్రైన్లలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల ప్రధాన డ్రైన్లలో సుమారు రూ.30 లక్షలతో పూడికతీత పనులు జరిగాయని అధికారులు చెబుతున్నారు. ఈ పనులతో ప్రయోజనం లేదని విమర్శలు వస్తున్నాయి. సోమవారం కురిసిన వర్షంతో వరి నాట్లకు మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: అకాల వర్షంతో పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయయ్యాయి. సోమవారం మధ్యాహ్న వేళ వాతావరణం కాస్త చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. ఏకధాటిగా గంట పాటు కురిసిన వర్షానికి పట్టణ ప్రాంతంలోని మురికివాడలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండాయి. కాలువల్లోని మురుగు రోడ్లపైకి వచ్చింది. మున్సిపల్ సెంటర్, కబడ్డీ వీధి, నాయీబ్రాహ్మణ కాలనీ, గోలివారి వీధి, శివాలయం వీధి, మెయిన్‌రోడ్డుతో పాటు పలు వీధుల్లో ముంపునీరు చేరింది. తాము ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకునే నాధుడు లేడని నాయీ బ్రాహ్మణ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికివాడల్లో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడపోవడం, పలు వార్డుల్లో సరైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక యంత్రాంగం స్పందించి ఆయా మురికివాడల్లో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'కూటమి' ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న శేషు బాబ్జీ

పిఠాపురం: ఎన్నికల్లో అంగన్‌వాడీ వర్కర్లకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డీఎస్ బాబ్జీ డిమాండ్ చేశారు. సోమవారం పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ అంగన్‌వాడీ వర్కర్లకు సెల్ ఫోన్లు ఇచ్చారని ఆ ఫోన్ల ద్వారా అనేక యాప్‌లు ఇచ్చారన్నారు. అప్పుడు ఇచ్చిన సెల్ ఫోన్లు ప్రస్తుతం పాడైపోయాయన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు పెంచుతామని చెప్పి, 14 నెలలు గడుస్తున్నా నేటికీ హామీలు నెరవేర్చలేదన్నారు. ఫోన్లు మార్చలేదని, దానికి తోడు అధికంగా వీరిపై పని ఒత్తిడి పెంచారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి, డి.తులసీదేవి, విజయశాంతి, ప్రజావాణి, నళిని, పద్మ కుమారి, బేబీరాణి, ఆర్ బేబీ, వెంకటలక్ష్మి, రాఘవమ్మ ప్రభ, సుజాత, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెద్దాపురం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబీ, ఎస్తేర్ రాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సరకుల పోషన్ ట్రాకర్, బాల సంజీవిని యాప్ ద్వారానే ఇవ్వాలని నిర్ణయించారన్నారు. సరకులన్నీ ఒకసారి రావడం లేదని, సరకులు ఇచ్చేటప్పుడు ఫొటోతో పాటు లబ్ధిదారుల ఫొటోలు తీయడం కష్టతరం అవుతుందన్నారు. ఒక్కో సరకు ఒక్కోసారి వస్తే మళ్లీ మళ్లీ యాప్ ద్వారా ఇవ్వడం వల్ల సమయం వృథా అవుతుందన్నారు. తక్షణమే ఈ యాప్‌ను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాలక్ష్మి, రాజేశ్వరి, వాణి, లోవకుమారి, విజయలక్ష్మి, తులసి, టీఎల్ పద్మావతి, ఎస్.మంగమ్మ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన చంద్రబాబు పాలన

- హామీలన్నీ అమలయ్యేదెప్పుడో?
- పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దొరబాబు



మాట్లాడుతున్న పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దొరబాబు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

పెద్దాపురం: రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వ పాలన గాడి తప్పిందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం సాయంత్రం కాండ్రకోట కళ్యాణ మండపంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా మండల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దవులూరి దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అంటూ చెప్పి ఇప్పుడు ప్రజలను మోసం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం దానినే తల్లికి వందనంగా పేరు మార్చిందన్నారు. గత ఏడాది ఈ పథకానికి ఎగనామం పెట్టిందన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఏడాదికి రూ.18 వేలు, ఉచిత బస్సు, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, యాభై ఏళ్లు దాటిన మహిళలకు పింఛను పథకాలు ఎక్కడ అమలు చేశారన్నారు. బూటకపు హామీలతో అందలమెక్కి ప్రజలను నట్టేట ముంచుతున్న కూటమి ప్రభుత్వం అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దొరబాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుమారుడు మట్టి మాఫియా డాన్‌గా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ పథకాలు పారదర్శకంగా అందాయన్నారు. ఇప్పుడు ఏదో రకంగా వాటికి కోత పెట్టేందుకే ప్రభుత్వం చూస్తుందన్నారు. 2029 ఎన్నికల్లో తప్పకుండా వైఎస్ జగన్‌మోహన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని దొరబాబు అన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జిల్లా కార్యదర్శి యినకొండ వీరవిష్ణుచక్రం, గోపు మురళి తదితరులు మాట్లాడుతూ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల మేనిఫెస్టోను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పవిత్ర గ్రంథంలా భావించి నూరు శాతం హామీలను ఏడాదిలోనే అమలు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, అభిమానులపై ఉందన్నారు. అనంతరం బాబూ ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను దొరబాబు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సరాలశెట్టి త్రినాథ్, బండారు వీరబాబు, సర్పంచ్‌లు శ్రీనివాస్, కనపర్తి చీమదొర, కురిమెళ్ల లోవరాజు, కొత్త చక్రరావు, ఆకుల వీరబాబు, ఒబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీ సభ్యులు భద్రరావు, నల్లల గోవిందు, వెంకటేశ్వరరావు, కుంచే బుచ్చిరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పల్ల గంగరావు, ఉప సర్పంచ్‌లు జోకా నానాజీ, గోలి రామారావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ జ్యోతుల నాగు, మేడిద వెంకట రామారావు, రంగనాధం శ్రీనివాస్, కుంచే వెంకన్న, పరిమి శ్రీను, గంటా రామస్వామి, మండల మహిళా అధ్యక్షురాలు బూరడ అచ్చిరాజు, కుంచే అమరావతి, ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి



పిఠాపురంలో శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా అందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లొకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢ మాసంలోని మాసశివరాత్రి రోజున అమ్మవారికి శాకంబరి అలంకరణ ఉంటుందన్నారు.

కుక్కుటేశ్వరునికి అభిషేకాలు

పిఠాపురం: త్రిగయా క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం పాదగయ క్షేత్రం సోమవారం ఇతర రాష్ట్రాల భక్తులతో కళకళలాడింది. ఆషాఢ మాసం చివరి సోమవారం కావడంతో మహారాష్ట్ర, ఒడిశా నుంచి పలువురు భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగాలకు భక్తులు అభిషేకాలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు.

లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలి



ఆయా విభాగాలకు ఎంపికైన విద్యార్థులతో రామారావు, విజయ్‌ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: ఈనాటి మహనీయులంతా ఒకప్పటి విద్యార్థులేనని, ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బాధ్యతలు అప్పగించు వేడుక (ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ) జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైడీ రామారావు మాట్లాడారు. లీడర్‌షిప్ బాధ్యతలు తీసుకున్న విద్యార్థి తోటివారికి ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలో చోళ, కాకతీయ, మరాఠ, మౌర్య విభాగాలుగా విభజించబడిన విద్యార్థులకు కర్తవ్య నిర్వహణ గుర్తులను అతిథులు అందజేశారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, మహారాణి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పిఠాపురం మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

పిఠాపురం: వ్యవసాయ లబ్ధి పొందాలన్నా.. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటకు పరిహారం అందాలన్నా ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి. అలాంటి ప్రక్రియకు అధికారులు సన్నద్ధం అయ్యారు. పిఠాపురం నియోజకవర్గంలో 43 వేల ఎకరాల సాగు భూమి ఉంది. గొల్లప్రోలు మండలంలో 10,452 మంది, కొత్తపల్లి మండలంలో 8,168 మంది, పిఠాపురం పట్టణం, మండలాల్లో 17,323 మంది రైతులు ఉన్నారు. ఇందులో పంటల సాగు చేస్తున్న రైతుల వివరాలతో ఈ-క్రాప్ నమోదుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ- క్రాప్ నమోదును ప్రారంభించారు. ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేస్తుంది. అన్నం పెట్టే రైతన్నకు ఆసరా కల్పించాలన్న ధ్యేయంతో పంటల బీమా కోసం అధికారులు ఈ- క్రాప్ నమోదు చేపట్టారు. పిఠాపురం నియోజకవర్గంలో దీనిని వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రంలో ఈ- క్రాప్ నమోదు చేయించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అన్ని మండలాల్లో ఈ- క్రాప్ నమోదుకు చర్యలు తీసుకుంటున్నామని పిఠాపురం ఏడీఏ స్వాతి తెలిపారు. సెప్టెంబర్ నెల వరకూ గడువు ఉన్నందున, రైతులంతా రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీఆర్ కార్డు తీసుకువెళ్లాలని అన్నారు. ఈ- క్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో రైతులకు అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. పంటల బీమా, ఇతర ప్రభుత్వ రాయితీలు రావాలన్నా ఇది తప్పనిసరి అని అన్నారు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, మల్బరీ, అపరాలు, మామిడి, జీడిమామిడి ఇలా ఏ పంటలైనా సరే చేయించుకోవాల్సిందేనని చెప్పారు.

చదువుకు చేయూత

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ప్రముఖ టీ పొడి వ్యాపారి మల్ల చంద్రశేఖర్ దంపతులు తండ్రిని కోల్పోయిన చిన్నారుల చదువుకు సాయమందించారు. ఈ మేరకు రూ.50 వేల నగదు మొత్తాన్ని కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్‌కు అందజేశారు. సతీష్ మాట్లాడుతూ, శ్రీ యువసేన ద్వారా ఇంటి దిక్కును కోల్పోయిన ఎందరో పిల్లల చదువుకు దాతల సాయంతో భరోసా ఇస్తున్నామని అన్నారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ఇద్దరు ఉద్యోగులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదుగా 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు' అందుకున్నారు. జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి సోమవారం విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటుగా సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ పద్ధతిలో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణం, భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్‌లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్‌లో విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన సామర్లకోటలోని టీటీఐ డీవీకేఎస్‌పీ చైతన్య, రాజమహేంద్రవరంలోని ట్రైన్ మేనేజర్ కె.పాపారావుకు అవార్డులు అందజేసి అభినందించారు.

గ్రామసభలు పక్కాగా నిర్వహించండి

కాకినాడ సిటీ: జిల్లాలో పీ-4 గ్రామసభలను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా, మండల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీ-4 కార్యక్రమంపై సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లా స్థాయి అధికారులంతా తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాలో 1.2 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 6,149 కుటుంబాలను మార్గదర్శకులు స్వీకరించామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటరావు, ప్రణాళికాధికారి పి.త్రినాథ్, గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.